వినాయక చవితి 'కాలమ్ దాటని కథల' పోటీలో ఎన్నికైన కథ




అస్థిపంజరాలకు పలుచటి తోలు కప్పినట్టున్నారు రావులమ్మ, ఆమె పిల్లలూను.

బుడతలకు తొమ్మిదేళ్ళు, ఏడేళ్ళూను. అనామకులకు పేర్లు అనవసరం అని కాబోలు, వారిని పెద్దోడు, చిన్నోడు అనే పిలుస్తుంది రావులమ్మ.

పెద్దోడు చిరిగిపోయిన, వదులైన ఖాకీ నిక్కరులో... బయటపడిన నల్లటి, నగ్నమైన దేహంతోటే... పనిలోకి వెళుతూంటాడు తల్లితో పాటు.

వాళ్ళ పని అగ్గిపెట్టెలు తయారుచేసే కంపెనీలో. అగ్గిపెట్టెల మీద లేబెల్స్ అంటించడం పెద్దోడి పని.

ఇక చిన్నోడయితే బిగుతుగా, మొలకు నానుకుపోయిన ఎర్రటి చెడ్డీతో తిరుగుతూంటాడు. మిగతా బాడీలోంచి ఎముకలన్నీ ఎక్స్-రే ఫోటోలోలా కనిపిస్తూంటాయి.

రావులమ్మకు భర్త లేదు. ఆ బుడతలకు తండ్రి లేదు. ఆ తల్లే రెక్కలు ముక్కలు చేసుకుని వాళ్ళను సాకవలసి వుంది.

తొమ్మిదేళ్ళ పెద్దాడు కూడా పనిలోకి వెళుతు న్నా- పొట్టలూ, బట్టలూ రెండూ కరువే వాళ్ళకు.

నగ్న దేహాలతో, వెన్నుకు అంటుకుపోయిన కడుపులతో, లోతుకు పోయిన కన్నులతో, ఆకలి చూపులతో- లేచొచ్చిన అస్థిపంజరాలలా, ఎక్స్ -రే ఫోటోలలా కదలాడే ఆ బుడతల్ని చూస్తూంటే కన్న కడుపు తరుక్కుపోతూంటుంది ఆ తల్లికి.

ఎప్పుడైనా, ఎవరైనా పెట్టిన అన్నం తెచ్చి ముందు



పెట్టగానే- హోటల్ బయట చెత్తకుండీ వద్ద ఎంగిలి ఆకు కోసం కలబడే కుక్కల్లా- ఆబగా ఆకు మీదకు దండెత్తే బుడతల్ని చూస్తూంటే కడుపు చెరువవుతుంది ఆమెకు... ఆ పసివాళ్ళకు పూటకో ముద్దయినా పెట్టలేకపోతున్నానే అన్న ఆవేదన ఆ కన్న ప్రాణాన్ని కలచివేస్తూంటుంది.

ఒక రోజున ఎవరో ధర్మాత్ములు ఇచ్చిన పాత చొక్కా ఒకటి ఇంటికి పట్టుకొచ్చింది రావులమ్మ.

దానిని చూడగానే 'నా కంటే- నా కంటూ' బుడతలిద్దరూ కీచులాడుకున్నారు.

"నీ కది పెద్దదయిపోతుందిరా, చిన్నోడా! పైగా, అన్న పన్లోకి ఎల్తన్నాడు గదరా, ఆ దొంటిమీదకో చొక్కా అయినా లేకపోతే ఎలాగని ఓ అమ్మనడిగి తెచ్చానిది" అంది రావులమ్మ.

పెద్దోడు సంబరంగా ఆ చొక్కా తొడుక్కుంటూంటే- చిన్నోడు ముఖం దించేశాడు.

"మరి నాకు మాత్రం చొక్కా వొద్దా? నాకు మాత్రం వొంటికి చలేయడం లేదా? నేను మాత్రం మీతోటి కంపెనీకి రావడం లేదా?" అన్నాడు వాడు అలుగుతూ.

"లేదు, నాన్నా! ఇది అన్నకు కురచయిపోగానే నీకే ఇచ్చేస్తాడుగా?" అందామె వాణ్ణి వొళ్ళోకి తీసుకుని అనునయిస్తూ.

హఠాత్తుగా పెద్దోడికి జబ్బుచేసింది.

అసలే ఆకలి జబ్బు. దానికి తోడు ఏదో జబ్బు.

ఆ రెండు జబ్బులతోనూ పోరాడే వోపిక లేక కాబోలు చెప్పా చేయకుండా ఈ లోకం నుంచి నిష్క్రమించాడు పెద్దోడు.

కడుపులో చిచ్చుపెట్టిన పిల్లోడి శవం మీదపడి లేని వోపిక తెచ్చుకొని మరీ ఏడుస్తోంది ఆ తల్లి.

బిక్కు బిక్కు మంటూ బిక్క మొకంతో అన్న శవం దగ్గరకు చేరాడు చిన్నోడు.

పరిస్థితి అర్థమయ్యీ, అవకుండా వుంది వాడికి.

"అమ్మా! అన్నకు ఏమయిందే?" అనడిగాడు తల్లిని.

ముక్కు చీది, "నీ అన్న చచ్చిపోయాడురా, చిన్నోడా!" అంటూ వాణ్ణి కావలించుకుని ఏడ్చింది రావులమ్మ.

"అయితే అన్న ఇక రాడా?"- చిన్నోడి సందేహం.

"రాదు రా. మనకిక కనిపించడు."

హఠాత్తుగా చప్పట్లు చరిచాడు చిన్నోడు, "భలే, భలే!" అంటూ సంతోషంగా.

"అయితే ఆ చొక్కా ఇక నాకే!... కదే. అమ్మా?" అన్నాడు సంబరంగా.

చిన్నోడి పలుకులకు వులిక్కిపడింది రావులమ్మ.

అక్కడున్న వారంతా కొయ్యబారిపోయారు.

●

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన కాలమ్ దాటని కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

- ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన కథ: ______________________

రచయిత/ రచయిత్రి: ______________________

పేజీ నంబరు: ______________________